క్లుప్తంగా

వైభవంగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజానగరం: స్థానిక శ్రీరాజలింగేశ్వరస్వామి, శ్రీరాజగోపాలస్వామి ఆలయ సముదాయంలో దేవతామూర్తుల కల్యాణోత్సవం గురువారం రాత్రి కన్నుల పండుగగా జరిగింది. పాల్గుణ బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ ఆలయాలలో కొలువైవున్న రాజరాజేశ్వరీ సమేత రాజలింగేశ్వరస్వామి, రుక్మిణీ, సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్లకు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా కల్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక ప్రముఖులు దూలం శ్రీవెంకట సూర్యనారాయణ (పెద్ద), దుర్గాపు వసంతరావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుల పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించిన ఈ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అనేక మంది భక్తులు తరలివచ్చారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: ది ఫిలాసఫీ ఆఫ్ అడ్జస్ట్‌మెంట్, యాంగ్జయిటీ అండ్ అకడమిక్ అచీవ్‌మెంట్ పుస్తకాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.సుబ్బారావు గురువారం ఆవిష్కరించారు. క్యాంపస్‌లోని బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుబ్బారావు, డాక్టర్ కొయ్యల మూడి రాధ ఈ పుస్తకాన్ని రచయించగా, న్యూఢిల్లీలోని బుక్ రివర్స్ ముద్రించింది. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ ఆచార్య పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ తదితరులు అభినందించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



వైఎస్సార్ సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

బిక్కవోలు: మండలంలోని తొస్సిపూడి గ్రామంలో టీడీపీ నుంచి మాజీ వార్డు సభ్యులతో పాటు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి వారికి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు మాజీ వార్డు సభ్యులు చంద్రమళ్ల శ్రీనివాస్, దాకమూరి అప్పన్న, చెక్కా శ్రీనివాస్, తూలూరి శ్రీనివాస్ తదితరులు తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: మండలంలోని చినకొండేపూడికి చెందిన గుండిమొగల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఏఎస్సై దాసరి సమర్పణరావు గురువారం తెలిపారు. గోపాలపురం మండలం కొవ్వూరుపాడుకు చెందిన గుండుమొగల సాయితో మూడేళ్ల క్రితం ఆమెకు వివాహమైంది. అయితే అధిక కట్నం కోసం భర్త సాయి, అత్త వీరలక్ష్మి ఆమెను శారీరకంగా, మానసికంగా ఇబ్బందులు పెడుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

30 మంది గ్రామ వలంటీర్ల రాజీనామా

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక, కాటవరం పంచాయతీ పరిధిలోని 30 మంది గ్రామ వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. బొబ్బిల్లంకలో 26 మంది వలంటీర్లు పనిచేసేవారు. వారందరితో పాటూ కాటవరం పంచాయతీలోని నలుగురు తన రాజీనామా లేఖలను ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు అందించారు. ప్రతిపక్ష పార్టీలు వలంటీర్లపై చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపం చెంది, ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ప్రభుత్వ నిర్దేశించిన విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించామని, తమపై ప్రతిపక్షాలు చేస్తున్న వ్యాఖ్యలు అనైతికమన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె చేస్తాం

ప్రకాశం నగర్: పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చే వరకూ విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని ఆంధ్రా పేపర్ మిల్లు 11 కార్మిక సంఘాలు తేల్చి చెప్పాయి. వేతన ఒప్పందం అమలు చేయాలని కోరుతూ కార్మికులు చేస్తున్న సమ్మె గురువారానికి మూడో రోజుకు చేరింది. కార్మికులు, యాజమాన్యంతో కార్మిక శాఖ అధికారి రాణి చర్చలు జరిపారు. సమస్యను పరిష్కారిస్తామని, కార్మికులు విధులకు హాజరు కావాలని సూచించారు. అయితే తమ డిమాండ్లు నెరవేర్చువరకూ సమ్మె కొనసాగిస్తామని కార్మికులు తెలిపారు.

ఆశల రబీ.. రైతుల ఖుషీ




కోటి కేశవరంలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు(ఫైల్)

- ఆశాజనకంగా దిగుబడి
- ప్రభుత్వ మద్దతు ధరపై హర్షం

మధురపూడి: మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలో రబీ వరికోతలు చివరి దశకు చేరాయి. దిగుబడి ఆశాజనకంగా ఉండటంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాగుకు ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహం అందించడంతో రైతులు ఏమాత్రం ఇబ్బంది పడకుండా ముందుకు సాగారు. నియోజకవర్గంలోని కోరుకొండ, రాజానగరం, సీతానగరం మండలాల్లో 16,600 ఎకరాల విస్తీర్ణంలో వరిని సాగు చేశారు. వీటిలో సీతానగరం మండలంలో విస్తీర్ణం ఎక్కువగా ఉంది. రైతుల నుంచి 49 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. దానికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేసింది.

దళారుల బెడద లేకుండా..

దళారుల వలలో పడి రైతులు మోసపోకుండా ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తుంది. సాధారణ రకం 75 కేజీల బస్తాకు రూ.1,637, 100 కేజీల బస్తాకు రూ.2,183లు చొప్పున అందించనున్నది. అలాగే ఏ గ్రేడ్ రకం 75 కేజీల బస్తాకు రూ.1,652, 100 కేజీలకు రూ.2,203 ప్రకటించింది.



మునగాలలో బస్తాల్లోకి నింపిన ధాన్యం

సాగు చేసిన రకాలు

దాళ్వా పంటకు అనుగుణంగా ఉండే రకాలను రైతులు ఎంపిక చేసుకున్నారు. వాతావరణానికి సరిపడే ఎంటీయూ 1156, ఆర్ఎస్ఆర్ 15048, ఎంటీయూ 1121 తదితర రకాలను సాగుచేశారు. ఈ ఏడాది ఆర్ఎస్ఆర్ 15048 రకాన్ని ఎక్కువ విస్తీర్ణంలో పండించారు. ఎంటీయూ 1121, 1153, 1156 రకాలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. ఆర్ఎస్ఆర్ 15048 రకం ధాన్యాన్ని ప్రైవేటుగా విక్రయిస్తారు.

దిగుబడి పెరిగింది



రబీలో యాజమాన్య పద్ధతులను అనుసరించడం కారణంగా దిగుబడి పెరిగింది. రైతన్నలకు ఆశాజనకంగా ఉంది. వరినాట్ల సందర్భంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో కాండం బలంగా తయారై, సాగునీరు మొక్కకు పుష్కలంగా చేరింది.

– బీకే మల్లికార్జునరావు, ఏడీఏ, వ్యవసాయశాఖ, కోరుకొండ

ప్రభుత్వ ప్రోత్సాహం



ప్రభుత్వం రైతాంగానికి అనేక రకాలుగా ప్రోత్సాహం అందించింది. దీంతో సాగు విస్తీర్ణం, దిగుబడి పెరగడానికి అవకాశం కలిగింది. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సహకారంతో సాగునీటికి ఎద్దడి రాలేదు. దీంతో దిగుబడి ఆశాజనకంగా ఉంది.

– మండపాక శ్రీను, మునగాల రైతు



తొస్సిపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

ప్రజలకు మంచి చేయడమే జగనన్న అజెండా

- ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి
- తొస్సిపూడిలో ఎన్నికల ప్రచారం

బిక్కవోలు: ప్రజలకు మంచి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అజెండా అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. గురువారం ఆమె మండలంలోని తొస్సిపూడి గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపలో మహిళలు ఆమెకు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య వ్యవస్థల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజలందరూ ఇంటింటికీ లబ్ధి చేకూర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతివ్వాలని కోరారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని ఎమ్మెల్యేగా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎంపీగా గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి త్రినాథ్‌రెడ్డి, ఉపసర్పంచ్ దార్వంపూడి వీర వెంకట రామారెడ్డి, ఎంపీటీసీ తేతలి సుమ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ నేకూరి రాజు, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాలు కర్రి వరలక్ష్మి, పంచాయతీ వార్డు సభ్యురాలు గొలుగూరి భారతి తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే



బైక్ ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రంగంపేట మండలంలో మూడు వేల బైక్‌లతో భారీ ర్యాలీ

రంగంపేట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ విజయఢంకా మోగించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలో మూడు వేల బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలం నలుమూలల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీస్థాయిలో బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ర్యాలీ ప్రారంభించారు. ముందుగా వడిశలేరు గ్రామం మీదుగా ఎస్టీరాజాపురం, ఈలకొలను, పాత వీరంపాలెం, కొత్త వీరంపాలెం, వీరంపాలెం పాకలు, బాలవరం, దొంతమూరు, ముకుందవరం, రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం, కొత్త కోటపాడు, పాత కోటపాడు, వెంకటాపురం, సుభద్రంపేట, దొడ్డిగుంట, మర్రిపూడి, సింగంపల్లి మీదుగా నల్లమిల్లి గ్రామం వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు పూల జల్లులతో స్వాగతం పలుకుతూ బ్రహ్మరథం పట్టారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి మళ్లీ వైఎస్సార్ సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎన్నికల అనంతరం కూటమి అభ్యర్థులు అడ్రస్ లేకుండా పోతారని చెప్పారు. త్వరలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పడనున్న ప్రభుత్వంలో గతం కన్నా మెరుగైన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలు చూడబోతున్నారని తెలిపారు. వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్లను అందజేసేవారని, అయితే ఇంటివద్దకే పింఛను అందకుండా చేసిన పాపం టీడీపీదేనని విమర్శించారు. ఇంటి వద్దే పింఛన్లు పొందే వృద్ధులు, దివ్యాంగులు, నానా అవస్థలు పడి సచివాలయానికి వెళ్లి తీసుకునే దుస్థితి తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత, రైతు విభాగాల కార్యదర్శులు పాలాటి నాగేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పోతుల బులి వీర్రాజు, పలు గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నల్లమిల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి, ఎంపీ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్

వైభవంగా వేంకటేశ్వర స్వామి ఊరేగింపు



పల్లకీలో ఊరేగుతున్న స్వామివారు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 12వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం మధ్యాహ్నం స్వామివారి పల్లకీ ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు అంగర వల్లీకాంతాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తుల నడుమ, కోలాట నృత్యాలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయం నుంచి వేంకటేశ్వర నగర్, బాలాజీ పేట, రామకృష్ణ నగర్, నవభారతి నగర్ తదితర వీధులలో తిరిగి మళ్లీ ఆలయానికి చేరుకుంది.

నేడు కల్యాణోత్సవం

స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం విశేషపూర్ణాభిషేకం, హోమాది కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

పింఛన్ల కోసం తప్పని నిరీక్షణ



సింగవరం సచివాలయం వద్ద వేచి ఉన్న పింఛన్ లబ్ధిదారులు



కోరుకొండ సచివాలయంలో పింఛన్ల పంపిణీ

సీతానగరం: పింఛన్ల కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్దకు వెళ్లడానికి ఇబ్బంది పడ్డారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు వర్ణనాతీతం. ముఖ్యమంత్రి జగన్ ఏర్పాటు చేసిన వలంటీర్లు ప్రతినెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇచ్చేవారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో చంద్రబాబు నాయుడి ఫిర్యాదు మేరకు ఎన్నికల సంఘం వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయించవద్దని చెప్పింది. ఆయా గ్రామ సచివాలయాల్లో బుధవారం పింఛన్ల కోసం లబ్ధిదారులు క్యూ కట్టారు. వారికి పంపిణీ చేసిన తర్వాత గురువారం నుంచి వృద్ధులు, దివ్యాంగులు, ఇళ్ల నుంచి బయటకు రాలేని వారికి సచివాలయం సిబ్బంది పింఛన్లు అందించారు.

మధురపూడి: కోరుకొండ మండలంలోని రెండోరోజు గురువారం పింఛన్ల పంపిణీ వేగవంతంగా జరిగింది. మండలంలోని 24 సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మండలంలోని 10,640 మంది లబ్ధిదారులకు రూ.3,22,31,000 అందజేశారు. మండలంలో 12,392 మంది లబ్ధిదారులున్నారు.

ప్రజల సేవకు నలుగురం సిద్ధం

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి
- ఎమ్మెల్యే రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: ప్రజలకు సేవలు అందించడానికి జక్కంపూడి కుటుంబం నుంచి నలుగురం ఎప్పుడు అందుబాటులో ఉంటామని, రాబోయే ఎన్నికల్లో సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా తన భర్త జక్కంపూడి రాజాను, ఎంపీగా డాక్టర్ శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని మహిళలకు బొట్టు పెట్టి అభ్యర్థించారు. డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలే కాకుండా, ఇవ్వని హామీలను సైతం అమలు చేసి ప్రజలకు మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. రాజానగరం నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు పెడుతోందన్నారు. కోవిడ్ సమయంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్‌లు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో సేవలు అందించారని గుర్తు చేశారు. సీతానగరం మండల ప్రజల చిరకాల కోరికైన కాతేరు – సీతానగరం రోడ్డును రూ.104 కోట్లతో నిర్మిస్తున్నామని, ఇప్పటికే పనులు చాలా వరకూ పూర్తయ్యాయన్నారు. రైతులతో పాటు ప్రజలకూ నాణ్యమైన విద్యుత్ అందించాలనే లక్ష్యంతో సీతానగరం మండలం కాటవరంలో రూ 2.78 కోట్లు, చినకొండేపూడిలో రూ.2.26 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్లను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. గడచిన 40 ఏళ్లుగా జక్కంపూడి కుటుంబం ప్రజాసేవకు అంకితమైందన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు (తోటలో రాజు), మండల యూత్ అధ్యక్షుడు కోల శ్రీను, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మట్ట శ్రీను, కాండ్రు వీరన్న, మట్ట పోశియ్య, తోరం బ్రహ్మాజీ, తోరం పోశియ్య, ఈత వీరబాబు, బాబు నాగేశ్వరరావు, వలవల వల్లీ, మట్ట మునియ్య పాల్గొన్నారు.



సీతానగరం పంచాయతీ లంకూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ

జవాబుదారీతనంతో ఎన్నికల విధులు



శిక్షణలో మాట్లాడుతున్న జేసీ తేజ్ భరత్



మాట్లాడుతున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం రూరల్: పారదర్శకత, జవాబుదారీతనంతో ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించాలని రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ అన్నారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం మాస్టర్ ట్రైనర్లు, బీఎల్‌వోలు, ఇతర ఎన్నికల సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ సెక్టార్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు ఈ శిక్షణ తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలింగ్ రోజు పీవోలు, ఏపీవోల పాత్ర, వారు అనుసరించాల్సిన ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సాయిబాబా, రూరల్, కడియం తహసీల్దార్లు అప్పారావు, రమాదేవి పాల్గొన్నారు.

అన్ని అంశాలపై అవగాహన

రాజమహేంద్రవరం సిటీ: మాస్టర్ ట్రైనీలు తమకు కేటాయించిన అంశాలపై అవగాహన పెంచుకుని, పోలింగ్ సిబ్బందికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వాలని రిటర్నింగ్ అధికారి, కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం సిటీ అసెంబ్లీ నియోజకవర్గ మాస్టర్ ట్రైనీలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు మాక్ పోల్ నిర్వహించే విధానం, ఈవీఎంలు సిద్ధం చేసుకోవడం, ఎన్నికల నిర్వహణ రిపోర్టు ఫారాలు నింపడం తదితర వాటిపై శిక్షణ ఇవ్వాలి. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ధవళేశ్వరం: సారా తయారీకి సిద్ధం చేసిన 6 వేల లీటర్ల బెల్లపు ఊటను ధవళేశ్వరం పోలీసులు ధ్వంసం చేశారు. గ్రామ శివారున ఉన్న పిచ్చుకలంకలో సారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. అక్కడ బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఎస్సై క్రాంతి కుమార్, హరి బాబు, ఎస్‌బీ అధికారులు పాల్గొన్నారు.



బెల్లపు ఊటను పరిశీలిస్తున్న సీఐ వినయ్‌మోహన్, పోలీసులు

చెక్‌పోస్టుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

కడియం: బోర్డర్ చెక్‌పోస్టుల వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. కడియం మండలం పొట్టిలంక వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించారు. అలాగే పలు వాహనాలను ఎస్పీ తనిఖీ చేశారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా గంజాయి, సారా, అక్రమ మద్యం, నగదు, నిషేధిత వస్తువుల రవాణాను అరికట్టాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉందన్నారు. వాహన డ్రైవర్లు, యజమానులతో మర్యాద పూర్వకంగా మాట్లాడాలని, ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ వెంట ఇన్‌స్పెక్టర్ బి.తులసీదర్, సిబ్బంది ఉన్నారు.